**మీకు తెలుసా?**

### తెలంగాణలో సాగు విస్తీర్ణం

| కేసీఆర్ ప్రభుత్వం వచ్చే నాటికి (2014- 15) | కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఇప్పుడు(2022 - 23) |
|---|---|
| వరిసాగు విస్తీర్ణం | వరిసాగు విస్తీర్ణం |
| **34.97** లక్షల ఎకరాలు | **121.00** లక్షల ఎకరాలు |



# మన తెలంగాణ.. సంస్కరణల కోన

## పదేండ్లలో కేసీఆర్ 10 విప్లవాత్మక సంస్కరణలు

- ప్రజల చెంతకే పారదర్శక పరిపాలన
- సత్వర సేవలే లక్ష్యంగా కీలక చర్యలు
- ఆధునిక టెక్నాలజీ దన్నుగా అద్భుతాలు
- విద్య, వైద్య, ఉపాధి, భద్రత, పరిపాలన.. ఇలా
- పదేండ్లలో ఎన్నో విప్లవాత్మకమైన సంస్కరణలు
- మూసధోరణులు, కాలం చెల్లిన విధానాలకు చెక్

బిగ్ స్టోరీ




**ఉన్నతమైన ఆలోచనలు ఉన్న వ్యక్తుల నుంచి మాత్రమే ప్రపంచాన్ని మార్చే గొప్ప సంస్కరణలను ఆశించగలమని గ్రీకులు నమ్మేవారు. దీన్ని ఆచరణాత్మకంగా చేసి చూపించింది కేసీఆర్ సర్కారు.**

77 ఏండ్ల స్వతంత్ర భారతావనిలో సంస్కరణల పేరు వింటేనే పేద, మధ్యతరగతి బిడ్డలు భయపడే దుస్థితి దాపురించింది. పేదల నెత్తిన భారం మోపడం, కాకులను కొట్టి గద్దలకు వేయడం, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టడం.. అనేవే గొప్ప సంస్కరణలుగా ఇప్పటి వరకు ప్రతి జాతీయ, ప్రాంతీయ పార్టీ వ్యవహరించింది. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలోనూ ఇదే జరిగింది. అయితే, ఏకపక్ష విధానాలకు, దోపిడీ పద్ధతులకు ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ సర్కారు చరమగీతం పాడింది. పేదలు, బడుగు బలహీన వర్గాల కోణంలో ఏకంగా పది విప్లవాత్మక నిర్ణయాలతో సంస్కరణలకు కొత్త అర్థాన్ని ఇచ్చింది. అలా.. దేశానికి కొత్తదారి చూపించి, సంస్కరణలకు అడ్డాగా తెలంగాణ గడ్డ మారింది.

... మ్యాకం రవికుమార్

తెలంగాణ ప్రభుత్వం గడచిన పదేండ్ల పాలనలో దేశంలో ఎక్కడా కనీవినీ ఎరుగని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సబ్బండ వర్గాలకు అండగా నిలబడింది. అనేక పరిపాలనా సంస్కరణలకు సైతం నాంది పలికింది. కొత్త జిల్లాలు, మండలాలు, పంచాయతీలను ఏర్పాటు చేసి పాలనా సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విధానపరమైన నిర్ణయాలను తీసుకుని ప్రజల చెంతకే పాలనను చేర్చడంతో పాటు, పారదర్శక సేవలను అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. ముఖ్యంగా కేసీఆర్ సర్కారు హయాంలో పదేండ్లలో వచ్చిన 10 విప్లవాత్మక సంస్కరణలు ఏమిటో ఓ సారి చూద్దాం...



### 1 పరిపాలన

ప్రజల చెంతకే పరిపాలనను చేర్చడంలో భాగంగా కొత్తగా జిల్లాలు, ఎప్పటికప్పుడు ప్రజల డిమాండ్, అవసరాల మేరకు కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు, తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఒక జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాలు ఒకే చోట ఉండేలా జిల్లా కేంద్రాల్లో సమీకృత కలెక్టరేట్లు, పోలీసు కార్యాలయాలను నిర్మిస్తున్నది. అధికారుల నివాస సముదాయాలను నిర్మిస్తున్నది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు సైతం క్యాంపు ఆఫీసులను నెలకొల్పింది. ఇక రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయాన్ని ఆధునిక హంగులతో నిర్మించింది. అన్ని మంత్రిత్వ శాఖల కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ఈ సచివాలయాన్ని తీర్చిదిద్దింది.



### 2 పోలీసు శాఖ

ప్రజల భద్రత కోసం, నేరాలను సమూలంగా అరికట్టేందుకు ప్రభుత్వం పోలీస్ కమిషనరేట్ల సంఖ్యను పెంచింది. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేసేలా రాష్ట్రంలో ఏడు నూతన పోలీస్ కమిషనరేట్లు, 10 కొత్త పోలీస్ జిల్లాలు, 112 కొత్త పోలీస్‌స్టేషన్లు, 31 సర్కిల్ కార్యాలయాలు, 25 సబ్ డివిజన్ ఆఫీసులు ఏర్పాటు చేసింది. యూనిఫాం సర్వీస్ డెలివరీ కోసం దేశంలోనే తొలిసారిగా పోలీస్ శాఖలో పని విభజనతో 16 వర్టికల్స్‌గా పని విధానాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఠాణాల్లో రిసెప్షన్ వ్యవస్థ ఏర్పాటు చేసింది. 56 రకాల సర్వీసుల కోసం రాష్ట్రస్థాయిలో టీఎస్ కాప్ యాప్‌ను తెచ్చింది.



### 3 రవాణా

అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులకు సంబంధించి టీఎస్ఆర్టీసీ, ఏపీఎస్ఆర్టీసీ మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో ఏపీలో 1,61,258 కిలోమీటర్ల పరిధిలో 826 బస్సులను టీఎస్ ఆర్టీసీ తిప్పే అవకాశం లభించింది. ఆర్టీసీని నష్టాల ఊబి నుంచి బయటపడ వేసేందుకు కార్గో సేవలను ప్రారంభించారు. ఫలితంగా ఆర్టీసీకి రోజుకు రూ.20 లక్షలకుపైగా అదనపు ఆదాయం సమకూరుతున్నది. ఆర్టీసీ ఉద్యోగుల సంరక్షణకు డిపోల వారీగా సంక్షేమ కమిటీలను నియమించారు. ఇటీవలనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్ తదితర రాయితీలను కల్పిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ట్రాక్టర్, ట్రాలీలకు రోడ్ ట్యాక్స్‌ను రద్దు చేసింది.




### 4 రెవెన్యూ

భూముల రిజిస్ట్రేషన్ కోసం ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో ఇష్టారాజ్యంగా రికార్డులు మార్చే సంస్కృతికి చెక్ పడింది. ఒకప్పుడు భూమి రిజిస్ట్రేషన్ జరగాలన్నా, హక్కుల మార్పిడి జరగాలన్నా రోజుల సమయం పట్టేది. పైరవీలు, అవినీతికి తావుండేది. కానీ ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత అరగంటలోనే రిజిస్ట్రేషన్, నిమిషాల వ్యవధిలోనే మ్యుటేషన్లు పూర్తవుతున్నాయి. అవినీతికి తెర పడింది.



### 5 పట్టణ, పురపాలక శాఖ

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో 52 మున్సిపాలిటీలు ఉండగా, కొత్తగా మరో 76 పురపాలక సంఘాలను ఏర్పాటు చేసింది. కార్పొరేషన్లు 6 మాత్రమే ఉండగా, ప్రభుత్వం మరో 7 మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. దీంతో రాష్ట్రంలో మున్సిపాలిటీల సంఖ్య 128కి, కార్పొరేషన్ల సంఖ్య 13కు పెరిగింది. మొత్తం పట్టణ స్థానిక సంస్థల సంఖ్య 141కు చేరింది. జీహెచ్ఎంసీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం ఆస్తిపన్ను రాయితీ ఇచ్చింది. వాటర్ బోర్డులో కూడా నీటిపై పన్నును, వడ్డీని మాఫీ చేస్తూ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చింది. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) పేరుతో ప్రత్యేక బ్యాంకును ఏర్పాటు చేసింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పింది. వీధి వ్యాపారుల కోసం రాష్ట్రవ్యాప్తంగా స్ట్రీట్ వెండింగ్ జోన్లను ఏర్పాటు చేస్తున్నది. పట్టణాలు, నగరాల్లో ఇండ్ల నిర్మాణ అనుమతులకు టీఎస్‌బీపాస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. 75 గజాల్లో ఏడు మీటర్ల ఎత్తు వరకు నిర్మించే ఇండ్లకు ఎలాంటి అనుమతులు అవసరం లేదు. 600 గజాల వరకు ఇన్‌స్టంట్ విధానంలో అనుమతులను మంజూరు చేస్తున్నది. నీటి కాలుష్య నివారణ కోసం జీహెచ్ఎంసీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్ఎస్‌టీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రతి వెయ్యి మందికి ఒక ప్రజా మరుగుదొడ్డి ఉండాలనే లక్ష్యంతో కొత్తగా 4,087 ప్రజా మరుగుదొడ్లను నిర్మిస్తున్నది.





### 6 పంచాయతీరాజ్

నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని 2018 సంవత్సరంలో తీసుకొచ్చారు. గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ చట్టాన్ని రూపొందించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలను పెంచారు. ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్‌ను అందజేశారు. ప్రతి గ్రామానికీ పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం ఏర్పాటయ్యింది. మొక్కల పెంపకానికి పంచాయతీరాజ్ చట్టంలో 10 శాతం నిధులను గ్రీన్ బడ్జెట్ కోసం కేటాయించారు.




### 7 పారిశ్రామిక రంగం

రాష్ట్రంలో టీఎస్ఐపాస్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు వేలాది పరిశ్రమలు రాగా, రాష్ట్రానికి వాటి ద్వారా రూ. 3.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. వీటితో 22.5 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందారు. ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ ద్వారా ఇప్పటి వరకు 334 చిన్న పరిశ్రమలను పునరుద్ధరించారు. ముచ్చర్లలో 10,400 ఎకరాల్లో అతిపెద్ద ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. డ్రోన్ పాలసీని ప్రారంభించిన మొదటి రాష్ట్రం తెలంగాణనే. వికారాబాద్‌లో మెడిసిన్ ఫ్రమ్ స్కై ప్రారంభించారు. గుండె రవాణా కోసం గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నారు. 9 ఉమ్మడి జిల్లాల్లో టీఎస్ఎఫ్‌పీ జోన్లు ఏర్పాటు చేస్తున్నది. గత ఏడాది 'తెలంగాణ ఎలక్ట్రిక్ వెహికిల్, ఎనర్జీ స్టోరేజ్ పాలసీ'ని ప్రవేశపెట్టింది.



### 8 వైద్యం

వైద్యరంగాన్ని ఉమ్మడి పాలకులు అసలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో చిన్న జ్వరాలకే ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉండగా, సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వైద్యరంగం అనూహ్యంగా మెరుగుపడింది. నిరుపేదలకు ఉచితంగా 58 రకాల పరీక్షలు నిర్వహించేందుకు ప్రతి జిల్లా దవాఖానలో డయాగ్నొస్టిక్ హబ్‌లను నెలకొల్పారు. తెలంగాణ వచ్చేనాటికి 5 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, రాష్ట్రం ఏర్పాటయిన వెంటనే 4 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసింది. మారుమూల ప్రజలకు సైతం సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ చేసేందుకు జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నది. దీంతో రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పెరిగి, స్థానిక కోటాలో తెలంగాణ విద్యార్థులకే లబ్ధి చేకూరుతున్నది. ఏఎన్ఎంల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వారి డిజిగ్నేషన్‌ను ఆఫీసర్లుగా మార్చారు. సాయంత్రం 6 తర్వాత కూడా పోస్ట్‌మార్టం చేసేలా నిబంధనలను సవరించారు.



### 9 సాగునీరు

ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం సహా ఇతర ప్రాజెక్టుల నిర్వహణకు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్, మొబైల్ యాప్‌లను వస్సార్ ల్యాబ్స్ ఇప్పటికే రూపొందించింది. ప్రతి వర్షపు బొట్టును ఒడిసి పట్టడం, ప్రాజెక్టుల్లోకి పూడిక చేరకుండా నిరోధించాలనే సంకల్పంతో రాష్ట్రంలోని అన్ని వాగులపై సుమారు 1,200 చెక్‌డ్యాంలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 625 చెక్‌డ్యాంల పనులు తుది దశకు చేరుకున్నాయి. మేజర్, మీడియం, సూక్ష్మస్థాయి ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటినీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చారు. టెరిటోరియల్ కేంద్రంగా ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. ఫలితంగా ఒక భారీ ప్రాజెక్టుకు ఇద్దరు లేదంటే ముగ్గురు చీఫ్ ఇంజినీర్లు అందుబాటులోకి వచ్చారు. ప్రాజెక్టులు, పంపులు, కాల్వలు, తూముల నిర్వహణ బాధ్యతల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను ఏర్పాటు చేశారు. చిన్నచిన్న మరమ్మతులు, అత్యవసర పనులకు ఈఎన్సీల అనుమతి లేకుండానే ఈఈ, డీఈల స్థాయిలోనే పనుల నిర్వహణకు మొత్తంగా అందరూ ఇంజినీర్లకు కలిపి ఏటా రూ.280 కోట్లకు పైగా కేటాయిస్తున్నారు.



### 10 సంక్షేమం

గురుకులాల్లో అనాథలకు 2 శాతం, ఎంబీసీలకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నది. పథకాలకు సంబంధించిన ఆదాయ పరిమితిని పెంచింది. రజక, నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నది. రజకులకు అధునాతన దోభీఘాట్లు, సెలూన్లకు నిధులను కేటాయించింది. ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే పనిని రజక సొసైటీలకే అప్పగించింది. 1098 బాలరక్షక్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్సీల అభివృద్ధి కోసం దళితబంధు పథకం కింద షరతులు లేకుండా రూ.10 లక్షలు అందిస్తున్నది. వైన్‌షాపుల్లో ఎస్సీలు, గౌడ కులస్తులకు రిజర్వేషన్లను కల్పించింది. ఏ ఇతర రాష్ట్రంలో లేనివిధంగా గౌడ కులస్తులే నీరా తీయడం, విక్రయాలు చేయాలని పేర్కొంటూ నీరా పాలసీని రూపొందించింది. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ పీవీ మార్గ్‌లో రూ.20 లక్షలతో నీరా కేఫ్ ఏర్పాటుచేసింది. కోకాపేటలో రూ.300 కోట్ల విలువైన స్థలం గౌడ భవన్‌కు కేటాయించి, భవన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేసింది.

---

**ఒక్కడు**

## ఆయన గాక ఇంకెవ్వరు?

రాదన్న తెలంగాణ తెచ్చి
మన ఆత్మగౌరవాన్ని నిలిపింది కేసీఆర్..

ప్రత్యేకమైతే చీకటైతదన్న రాష్ట్రాన్ని
వెలుగు జిలుగులు చేసింది కేసీఆర్

సంక్షోభంలో ఉన్న ఎవుసాన్ని
'సంక్షేమ' సాగు చేసింది కేసీఆర్


ఎవుసం దండుగన్న చోట..
పండుగోలె చేసింది కేసీఆర్

అన్నం లేక పస్తులున్న అన్నదాత
దేశానికి అన్నం పెట్టేలా చేసింది కేసీఆర్

అభాగ్యులు మలిదశలో మంది దగ్గర
చేయి చాచకుండా ఆసరా అయ్యింది
కేసీఆర్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో ఆడబిడ్డ పెండ్లికి
'లక్ష'ణంగా సాయమయ్యింది కేసీఆర్

కేసీఆర్ కిట్‌తో..
పురిటికొచ్చిన ఆడబిడ్డకు సారె పెట్టింది
కేసీఆర్



ఏండ్లుగా దగాపడ్డ దళితజాతికి
దళితబంధువైంది కేసీఆర్

కులమతాల భేదం లేకుండా..
తెలంగాణను లౌకిక వేదికగా నిలిపింది
కేసీఆర్

అందుకే ఆయనగాక ఇంకెవ్వరు?
మన బతుకులకు కొత్త అర్థం చెప్పిన
కేసీఆర్‌కు సరి సాటెవ్వరు??

-రాజు అతికం
9440012834

# గవన్నీ యాదిమరుత్తమా!




మళ్లా ఎన్నికలత్తానయ్. గారడీజేశేందుకు గుంపులన్నీ మోపైతానయ్. ఆదమర్తె గంతే సంగతి. రేపోమాపో ఓట్లడిగేందుకు గడపదగ్గరికొత్తరు. గప్పుడొక్కటే యాదికుంచుకోండ్లి.. ఏండ్ల తరబడి తెలంగాణను ఏలి ఏం ఒరగబెట్టిల్లో గాళ్లనే అడుగుండ్లి. లేదంటే గీ పదేండ్లళ్ల మనం జూశిన సంబురమేందో ఎరుకయ్యేటట్టు గాళ్ల మొఖాన్నే జెప్పుండ్లి. గంతెందుకు మనలమనమనుకుందాం. గీ తెలంగాణ రాక మునుపు మన బతుకులెట్లున్నయో మనకు దెల్వదా. ఏం కొనేటట్టు.. ఏం తినేటట్టు లేకపాయె. పనికిబోదామంటే పని కరువాయె. సరెతీ.. సొంతంగేదైన సక్కబెట్టుకుందామన్నా సిల్లిగవ్వ శేతిల లేదాయె. ఒకటా.. రొండా..?! గంటలతరబడి కరెంటు కోతల్ని మర్శిపోతమా ఏంది? కరెంటడిగితే కాల్సి సంపలే?.. ఊరియా బత్త కోసంగూడ సద్దిగట్టుకొని పొద్దంత కాళ్లుబీకంగా నిలబడ్డే?! ఇగ పిల్లకు పెండ్లి జేద్దామన్నా ఒక్కడు సాయం జేశిండా?! పొట్టతోనొచ్చిన పొల్లకు పురుడు పోశిండ్ల..?! ఎవుసం దండుగన్నది గాళ్లేనాయే! పంటలు పండకపాయె, పండిన పంటకు ధరల్లేకపాయె..

మనం గంజిదాగి మన పోరగాళ్లను సర్కారు బడుల్నొదిలి పైవేటు ఇస్కూళ్లకు తోలింది యాదికొత్తలేదా?! గియ్యాల గీ కట్టాలేవీ మనకులేవ్.. అయినా నోరుదెర్శి అడుక్కోపోతే అవ్వైనా బువ్వ పెట్టదంటరు. గట్లాంటిదిమరి మనకిదిగావాలె అని శెప్పకున్నా, శేసుకుంటపోతాన గీ సర్కారును కాపాడుకోవాల్నా లేదా. నిమ్మలంగ గూకోని ఆలోశిత్తె మీకే దెల్తది. రైతన్నలకు రైతుబంధు, రైతుబీమా.. మన దళిత అన్నదమ్ములు, అక్కజెల్లెండ్లకు దళితబంధు.. పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలచ్మి, షాదీ ముబారక్ గిట్ల శెప్పుకుంటాబోతే ఎన్నో ఉన్నయ్.. సర్కారు దవాఖానలకు కార్పొరేట్ కళదెచ్చింది.., సింగరేణికి బలం పెంచింది.., పాలమూరు వలస గోసల్నిదీర్చింది.., వరంగల్లు దశ మార్చింది.. గీ కేసీఆర్ సారేగదా!! నీళ్లుదాగితేనే కాళ్లుజేతులు వంకరబోయిన నల్లగొండకు మంచినీళ్లచ్చింది రాష్ట్రంల గిప్పుడున్న ప్రభుత్వంలనే అన్నది మరుత్తమా? సమైక్యాంధ్రోళ్ల శేతలకు మూగగ ఏడ్శిన తెలంగాణ పల్లె గిప్పుడే మురిసిపోతాందన్నది యాదుండాలె. కాళేశ్వరం కట్టతోని ఇండ్లళ్ల బిందెలు నిండె.. ఊర్లళ్ల శెర్లునిండె. ఏటికేడు శేప పిల్లలు, గొర్రె

**ఓ(కో)ట్ దిస్ పాయింట్**

పిల్లలు ఇత్తున్నరు. శేనేతకు శేయూత, గౌడన్నలకు బాసటగ ఉంటున్నరు. గిరిజనులకు పోడు భూములిచ్చి మన ముఖ్యమంత్రి పెద్ద కొడుకైండు. అన్ని కులాలు, మతాలకు నాయం జరుగుతాంది. ధరణితోని భూముల పంచాదులన్నీ పాయె. సాగు సల్లగుంటాంది.. పల్లె పచ్చగుంటాంది.

ఇగ ఐదరబాద్‌ను ఇశ్వనగరంజేశి లచ్చల కోట్ల పెట్టుబడుల్ని తిస్కత్తున్నది సూత్తనే ఉన్నం. ఏల కొలువుల్ని ఇప్పిత్తున్నది కండ్లవద్దనే ఉండె. ఉమ్మడి రాష్ట్రంల పావలా, అర్ధ బలికిన జాగలు ఇయ్యాల కోట్లకైనయ్. పాలన కోసం పది జిల్లాల్ని 30కిపైన పెంచుకున్నం. గిప్పుడు తెలంగాణ పర్యాటకంగా, పారిశ్రామికంగా, వ్యాపారపరంగా పస్తున్నది. గిది గా మోదీ సర్కారే ఒప్పుకున్నది. అయినా.. అభివృద్ధి అంటే శెప్తె ఇనబడేదిగాదు.. సూత్తె గనబడేది. కండ్లుండీ సూడలేక గుడ్డోళ్లై గీ సర్కారు మీద గా కాంగ్రేసు, బీజేపోళ్లు దుమ్మెత్తిపోత్తాండ్లు. గాళ్లపాపం గాళ్లకే కొడ్తదిలే. మనం మాత్రం గాళ్ల కండ్లళ్ల కారంగొట్టినట్టు మళ్లా గీ బీఆర్ఎస్ సర్కారునే నిలబెట్టుకుందాం.

-అంకం సంతోష్